

బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి జట్టుకు సౌజన్య



అభినందిస్తున్న కలెక్టర్

ఏలూరు:జాతీయస్థాయి బాస్కెట్ బాల్ జట్టుకు పెదవేగి మండలం విజయరాయి పంచాయతీ కార్యదర్శి వలపుల సౌజన్య ఎంపికయ్యారు. ఈ నెల తొమ్మిదో తేదీన విజయవాడలో జరిగిన అఖిల భారత సివిల్ ఎంప్లాయిస్ స్టేట్ సెలెక్షన్స్‌లో సౌజన్య జాతీయస్థాయికి ఎంపికైంది. జాతీయస్థాయి క్రీడలు అక్టోబర్‌లో జరగనున్నాయి. జిల్లా నుంచి ఎంపికైన సౌజన్య రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆమెను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ జి.పద్మశ్రీప్రసాద్, జిల్లా అధికారులు అభినందించారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ మాట్లాడుతూ సౌజన్య ఇటు విధుల్లోను, అటు క్రీడల్లోనూ రాణిస్తుందన్నారు.



చింతలపూడిలో..



కైకలూరులో..

పెల్లుబికిన తెలుగుతమ్ముళ్ల నిరసన

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుతో నాయకుల ఆగ్రహం - జిల్లావ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుతో తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ జిల్లావ్యాప్తంగా ఆదివారం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేశారు. పలుచోట్ల కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు.

ఉంగుటూరు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ నాయకులు ఉంగుటూరులో కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జరిగిన ఈ దీక్షలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు రవిశంకర్, బొమ్మిడి అప్పారావు, మారిశెట్టి ప్రసాద్, నేకూరి ఆశీర్వాదం, దిడ్ల శ్రీను, మోషే, నాయకులు నల్లా ఆనంద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి నేతలు మండలంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పెదపాలపర్రులో పార్టీ మండల మాజీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. గ్రామ ప్రధానసెంటర్‌లో రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో గ్రామ సర్పంచి గంటా రాకేష్, ఉపసర్పంచి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : చంద్రబాబు అరెస్టు అనైతిక చర్య అని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీ నారాయణ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కొయ్యలగూడెంలో పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక నిరాహార దీక్షకు సంఘీభావంగా మండలం నుండి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం తరలి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును రాజకీయ కక్షతో అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమ అరెస్టు చేయడం అనైతిక చర్య అని అన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజాక్షేత్రంలో జగన్ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్రకార్యదర్శి వాసిరెడ్డి మోహన్‌రావు, కాల్నీడి రాంబాబు, గండబోయిన శ్రీను, సాయి పాల్గొన్నారు.

చింతలపూడి : చంద్రబాబును తక్షణం విడుదల చేయాలని మాజీ ఎంఎల్‌ఎ గంటా మురళీ, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ముత్తారెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్ష శిబిరంలో టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకట రామయ్య, ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవ, పట్టణ అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి బోడా భూషణం, ఎస్‌సి సెల్ నియోజకవర్గ కన్వీనర్ పల్లి శ్రీను, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బొడా అనీష్‌కుమార్, మానేపల్లి రాజారావు తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, యువ నాయకులు బొమ్మజి అనిల్, సొంగా రోషన్ కుమార్, కామరపుకోట మండల పార్టీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్, వీరేంద్ర పాల్గొన్నారు.



టి.నరసాపురంలో..

బుట్టాయగూడెం : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. ఆయనతో పాటు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు చాపల విజయకుమార్, తెలుగుయువత మండల ఉపాధ్యక్షులు సుంకర వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కాట్రేనిపాడులో టిడిపి నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ దీక్ష చేపట్టారు. దీక్షలో గద్దల సుహాసిని మోహన్‌రావు, బడిపాటి సాంబయ్య, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల సత్యనారాయణ, ముక్కయ్య, సూర్యదేవర శ్రీనివాసరావు, సొంగా ఇస్సాక్, వెంకటరావు, పిన్నబోయిన మంగయ్య, చంటి, శ్రీను పాల్గొన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు.

చాట్రాయి : చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ నిరాహార దీక్షకు బయలుదేరిన టిడిపి నాయకులను, కార్యకర్తలను చాట్రాయిలోని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి ఇంటివద్ద రెండో రోజు కూడా పోలీసులు అడ్డుకున్నారు. వారిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు గడ్డం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కంపసాటి శంకర్‌రావు, చల్లారి రామకకృష్ణ, మరీదు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కైకలూరు : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



చాట్రాయిలో నేతల గృహనిర్బంధం

కలిదిండి : కైకలూరులో జరిగిన రిలే నిరాహారదీక్షా శిబిరానికి కలిదిండి నుండి టిడిపి నేతలు తరలివెళ్లారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, జగన్‌రెడ్డి పాలనను సాగనంపాలని రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి ఆంగ్రాజు శ్రీనివాసరావు కోరారు. బిసి సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసచక్రవర్తి, సర్పంచులు గూడవల్లి శ్రీనివాసరావు, పరసా వెంకట స్వామి, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కురెళ్ల ఏడుకొండలు, రైతు విభాగం అధ్యక్షులు విష్ణుమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ స్థానిక బోసుబొమ్మ సెంటర్ వద్ద టిడిపి నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. టిడిపి పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో బోసుబొమ్మ కూడలి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రావు కృష్ణ, మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, షేక్ ముస్తఫా, రమాదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముసునూరులో..



బుట్టాయగూడెంలో..

అగ్రిమెంట్లు అమలు చేస్తారా..!

మొక్కజొన్న సీడ్స్ సాగులో కంపెనీల ఇష్టారాజ్యం

ప్రతియేటా నష్టాలతో రైతుల ఆత్మహత్యలు

నష్ట పరిహారం ఇవ్వకుండా సీడ్స్ కంపెనీల నిర్లక్ష్యం

తామేమీ చేయలేమంటున్న వ్యవసాయాధికారులు

ఈ ఏడాదైనా రైతులకు మేలు జరిగేలా చర్యలుండేనా?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొక్కజొన్న సీడ్స్ కంపెనీలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు సాగుతోంది. రైతులను నిలువునా మోసగిస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. తమకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు వ్యవసాయాధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో నాణ్యత లేని సీడ్స్‌తో నష్టపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు జిల్లాలో నిత్యకృత్యంగా మారుతున్నాయి. ఈ నెలాఖరు నుంచి మొక్కజొన్న సాగు ప్రారంభం కానుంది. గతంలో మాదిరిగా కాకుండా సీడ్స్ సాగు చేస్తున్న రైతులకు నష్టం వాటిల్లితే కంపెనీలు పరిహారం ఇచ్చేలా సంస్థలు అగ్రిమెంట్లు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగు సాగుతోంది. మొక్కజొన్న సాగులో సీడ్స్ సాగు, కమర్షియల్ సాగు అనే రెండు రకాల పద్ధతుల్లో రైతులు సాగు చేస్తారు. ఏలూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో కంపెనీల మొక్కజొన్న సీడ్స్‌ను రైతులు సాగు చేస్తున్నారు. మొక్కొజొన్న సీడ్స్ సాగులో విత్తన కంపెనీల ప్రతినిధులే రైతుల వద్దకు వెళ్లి తమ సీడ్స్ సాగు చేయాలని ఇస్తారు. దిగుబడి ఎంత వస్తుంది, ఏయే రకాల సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో కూడా కంపెనీల ప్రతినిధులే రైతులకు వివరిస్తారు. పండిన పంటను రైతుల నుంచి కంపెనీలే కొనుగోలు చేస్తాయి. కమర్షియల్ సాగులో మాత్రం రైతులు విత్తనం కొనుగోలు చేసుకుని సాగు చేస్తారు. కమర్షియల్ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. సీడ్స్ సాగులోనే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కంపెనీల్లో తమ సీడ్స్‌ను ట్రయల్ పద్ధతిలో రైతులకు అందించి సాగు చేయిస్తున్నారు. దిగుబడి వస్తే తమ సీడ్స్ గొప్ప అన్నట్లు చెబుతున్నారు. దిగుబడి రాకపోతే మాత్రం రైతులదే తప్పన్నట్లు మాట్లాడి గాలికొదిలేస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఇదేవిధంగా గతేడాది రైతు ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వల్లే సీడ్స్ కంపెనీలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

అగ్రిమెంట్ నిబంధనలు అమలు చేయరా..!

సీడ్స్ కంపెనీలు తమ విత్తనాన్ని రైతులకు అందించేటప్పుడు నిబంధనల ప్రకారం అగ్రిమెంట్లు రాయాల్సి ఉంటుంది. అగ్రిమెంట్‌లో సీడ్స్ విత్తనంతో నష్టం వాటిల్లితే రైతులకు నష్టపరిహారం ఇచ్చేలా పొందుపర్చాల్సి ఉంది. అయితే జిల్లాలో ఎక్కడా అగ్రిమెంట్ల నిబంధన అమలు కావడం లేదు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. దాదాపు దశాబ్దకాలంగా రైతులు పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అగ్రిమెంట్ లేకపోవడంతో సీడ్స్ పంట దెబ్బతింటే రైతులకు కంపెనీలు ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వడం లేదు. దీంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. నాణ్యమైన సీడ్స్ ఇవ్వని కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సీడ్స్ కంపెనీలు మరింత రెచ్చిపోతున్నాయి. ఈ ఏడాదైనా అగ్రిమెంట్లు రాసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రతి గ్రామంలోనూ రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. రైతుభరోసా కేంద్రాల్లో పని చేసే అధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటే మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. సమగ్ర విత్తన చట్టం లేకపోవడం కారణంగా విత్తన సంస్థలు ఈ విధంగా రెచ్చిపోతున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా అధికారులు మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండేలా చర్యలు చేపట్టాలి

నిమ్మగడ్డ నరసింహ, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు

మొక్కజొన్న సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ లేకుండాపోయింది. సీడ్స్ అందించే కంపెనీలు రైతులకు రాతపూర్వక అగ్రిమెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. రైతుభరోసా సహాయకులతో పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలి. సీడ్స్ పంట దెబ్బతింటే ప్రభుత్వ అధికారులే బాధ్యత తీసుకుని రైతుకు న్యాయం జరిగేలా చూడాలి. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో సమగ్ర విత్తన చట్టం తీసుకురావాలి.

మొక్కలు నాటితేనే భవిష్యత్

సబ్సిడీపై అందిస్తున్నాం, స్పందన బాగుంది : డిఎఫ్ఒ హిమశైలజ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పర్యావరణ సమతుల్యతను కాపాడాలని, అడవులు 70 శాతం మేర ఉండాలని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే దానికి పరిస్కారమార్గంగా ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో అడవులను పెంచేందుకు సామాజిక వన విభాగం కృషి చేస్తోంది. రోడ్ల వెంబడి, గృహసముదాయాలు, కాలనీలు, పొలంగట్లు తదితర చోట్ల సామాజిక వనాలను అభివృద్ధి చేసేనదుకు కృషి చేస్తోంది. ఈ శాఖ మొక్కలను పెంచి ప్రజలకు కూడా నామ మాత్రపు ధరకు అందజేస్తుంది. ఈ నేపథ్యంలో సామాజిక వనాల ఏర్పాటు ప్రక్రియ ఎలా జరుగుతుంది. ప్రజల సహకారం ఎలా ఉంది ఇత్యాది అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో జిల్లా సోషల్ ఫారెస్ట్రీ (డిఎఫ్ఒ) ఎం.హిమశైలజ వివరించారు.





ప్రశ్న : జిల్లాలో సామాజిక వనాల పెంపు ఎలా సాగుతోంది?

జిల్లాలో ఆడవుల పెంపు కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. టెర్రిటోరియల్, సోషల్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ విభాగాల ద్వారా అవసరమైన ప్రాంతాల్లో మొక్కలు నాటడం, అడవులు పెంచడానికి కృషి చేస్తోంది. సామాజిక వన విభాగం పరిధిలో గతంలో అనేక కార్యక్రమాల ద్వారా మొక్కలు నాటాము. నరేగా, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా మొక్కలు నాటడం, పెంచడం జరిగేది. ఈ ఏడాది కేవలం కంపాస్ పథకం ద్వారా మాత్రమే నర్సరీల్లో మొక్కలు ఉత్పత్తి చేసి, ప్రజలకు అందిస్తున్నాం.

ప్రశ్న : ఈ ఏడాది ఎన్ని లక్షల మొక్కలు అందించారు?

జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రజలకు 7.8 లక్షల మొక్కలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఇప్పటి వరకూ చాలావరకూ పూర్తయింది. నిమ్మ, దానిమ్మ, మామిడి, వేప, ఉసిరి వంటి మొక్కలున్నాయి.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి?

జిల్లాలో ఏడు చోట్ల అంటే శనివారపుపేట, మర్లగూడెం, బుట్టాయగూడెం, తడికలపూడి, పి.పురం, నామవరం, వెంకట్రామన్న గూడెం, బత్తులవారిగూడెం నర్సరీల్లో మొక్కలుపెంచాం. మొత్తం పది నర్సరీలుండగా, కంపాస్ పథకంలో విడుదలైన నిధులు, కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కమిటీ నిర్ణయం మేరకు 7.8 లక్షల మొక్కలను ఏడు నర్సరీల్లో పెంచడం జరిగింది.

ప్రశ్న : మొక్కలు ఎవరెవరికి అందిస్తున్నారు?

మొక్కలు ఎవరైనా తీసుకోవచ్చు. అయితే కంపాస్ పథకంలో సబ్సిడీపై మాత్రమే మొక్కలు ఇస్తున్నాము. టేకు మొక్క ఒక్కోటి రూ.ఐదు చొప్పున, ఇతర మొక్కలు రూ.రెండు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు నకలు తెచ్చి మొక్కలు సబ్సిడీపై తీసుకెళ్లొచ్చు. 15 రోజులుగా మొక్కలు అందిస్తున్నాము. గతంలో నరేగాలో పాఠశాలలు, ఆసుపత్రులు, గ్రామ పంచాయతీలకు ఉచితంగా పంపిణీ చేశాము. ఇప్పుడు ఎవరైనా సబ్సిడీ మీద తీసుకువెళ్లాల్సిందే. స్పందన బాగుంది.

ప్రశ్న : రోడ్ల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం ఎంత వరకు వచ్చింది?

జిల్లాలో పది కిలో మీటర్ల పొడవునా మొక్కలు నాటాలని జిల్లా కమిటీ నిర్ణయించింది.

ప్రశ్న : జిల్లాలో సామాజిక వనవిభాగానికి ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉందని అంటున్నారు?

జిల్లాలో అలాంటి సమస్య లేదు. సరిపడా సిబ్బంది ఉన్నారు.

16న కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొబ్బరి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న రాజమండ్రిలో కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనంలో కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను రైతు సంఘం నాయకులు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు రాజమండ్రి, గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ భవనం హాలులో సదస్సు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి కొబ్బరి రైతులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎకరా కొబ్బరి తోటకు రూ.60 వేలకుపైగా పెట్టుబడి అవుతోందని, చెట్టు నుండి కొబ్బరికాయ కోసి గుట్టగా పోయడానికి కాయకు రూ.మూడు ఖర్చవుతుందన్నారు. అయితే వ్యాపారులు ఎండు కొబ్బరికి కాయకు రూ.ఏడుకు మించి ధర ఇవ్వడం లేదన్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి కొబ్బరి ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం వల్లనే కొబ్బరి రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులు ఆపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేసి నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి రైతులకు కనీస ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు అనుమోలు మురళీ, రైతులు పాల్గొన్నారు.



దీక్ష చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగులు

ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి రాష్ట్ర అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు అధ్యక్షతన వేడుకోలు దీక్ష ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు ప్రజాసంకల్ప పాదయాత్రలో కలిసినప్పుడు 'మన ప్రభుత్వం వస్తుంది.. మీ అందరి సమస్యలు తీరుస్తుంది' అని చెప్పి అధికారంలోకి వచ్చారని, వచ్చి నాలుగేళ్లయినా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేస్తామని, జిఒ 40 కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా సమగ్ర శిక్ష, ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్షా, కెజిబివిలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్‌కు సాగునీటి కొరత లేదు

జలవనరుల శాఖ అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఖరీఫ్ సాగుకు ప్రస్తుతం ఎలాంటి సాగునీటి కొరతా లేదని సిబి కెనాల్ వడాలి సెక్షన్ జెఇ సిద్ధార్థ, పోల్‌రాజ్ కెనాల్ ముదినేపల్లి సెక్షన్ ఎఇఇ వికెవి.కిషోర్ తెలిపారు. ఆదివారం ప్రజాశక్తిలో 'వీడని సాగునీటి కొరత' శీర్షికతో వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. ఖరీఫ్ సాగుకు ప్రస్తుతం నీటి కొరత మండలంలో లేదన్నారు. తరచూ వర్షాలు కురుస్తుండటంతో వరిసాగుకు ఏ మాత్రమూ నీటి ఇబ్బందులు లేవన్నారు. వర్షాలు వరిచేలకు మంచి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. మండలంలోని రెండు ప్రధాన పంట కాలువల ద్వారా వంతులవారీ విధానంలో సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు వారు తెలిపారు. ఒక్కో కాలువకు ఐదు రోజులు చొప్పున వంతులవారీగా నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆక్వారైతులు పంట కాల్వల ద్వారా వరిచేలకు వెళ్లే నీటిని మళ్లించకుండా అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆక్వా రైతులు ఎవరైనా పంట కాల్వల ద్వారా సరఫరా చేసే నీటిని చేపల, రొయ్యల చెరువులకు మళ్లిస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన మెమోను రద్దుచేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరులోని సిఐటియు కార్యాలయంలో భావన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం ఎర్ర రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల నుండి ప్రభుత్వం అక్రమంగా వాడుకున్న డబ్బును నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు జమచేసి పెండింగ్ క్లయిములు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఎంఎల్ఎలకు, మంత్రులకు వినతిపత్రాలిచ్చామని, ప్రభుత్వం స్పందించకపోతే కార్మికులను రాష్ట్రవ్యాప్తంగా సమీకరించి చలో అమరావతి చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని నిర్మాణ కార్మికులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పరస శ్రీను, రెడ్డి లక్ష్మణరావు, ఎం.గోపాలకృష్ణ, పరస రాజేష్, చీర అప్పారావు మాట్లాడారు.

15న అగ్రిగోల్డ్ బాధితుల సామూహిక దీక్ష

ఏలూరు టౌన్:ఎపి, మరో ఏడు రాష్ట్రాల్లో అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో సామూహిక దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు యర్రా వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యాలయంలోని స్ఫూర్తి భవనంలో ఈ దీక్షలకు సంబంధించిన కరపత్రాలను అసోసియేషన్ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పోరాట ఫలితంగా కొంతమంది బాధితులకు రూ.20 వేలలోపు బాండ్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని, ఇంకా అనేక లక్షల మంది లబ్ధిదారులకు అగ్రిగోల్డ్ తాలూకు బాండ్స్, స్థలాలు ఇవ్వాల్సి ఉందని వారు తెలిపారు. సిఎం జగన్ అధికారంలోకి రాగానే వారం రోజుల్లో బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని నాలుగేళ్లయినా అమలు చేయలేదని విమర్శించారు. అగ్రిగోల్డ్ బాధితులు ఆర్థిక ఇబ్బందులతో వందలాదిమంది ఆత్మహత్యలు, అనారోగ్యాలతో మృతిచెందారని, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.పది లక్షల సహాయం తక్షణం చేయాలని వారు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జరిగే సామూహిక దీక్షలో ఏలూరు జిల్లాకు చెందిన అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. విజయవాడ కార్యక్రమం ముగిసిన తర్వాత ఏలూరు జిల్లాలో అగ్రిగోల్డ్ ఏజెంట్లు ప్రతీ కస్టమర్ వద్దకు వెళ్లి వారిని చైతన్యపరచి రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలకు సంసిద్ధం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, సూర్య నారాయణ, నాగేశ్వరరావు, జగన్ పాల్గొన్నారు.

సాగర్‌బాబుకు సన్మానం

కొయ్యలగూడెం:కేంద్ర ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విజయం సాధించిన కన్నాయగూడేనికి చెందిన సాగర్‌బాబును కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సాగర్‌బాబు దళిత కుటుంబంలో పుట్టి, కడుపేదరికంలోనూ ఉన్నత చదువులు చదివి విజయం సాధించడం హర్షణీయమన్నారు. సాగర్‌బాబుని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం దళితులపట్ల వరంగా మారిందని ఇలాంటి విజయాలను చూస్తుంటే అర్థమవుతుందన్నారు. సాగర్‌బాబుని యువతరం స్ఫూర్తిని పూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్నాయగూడెం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, సాగర్‌బాబు బంధువులు పాల్గొన్నారు.



సాగర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు



వార్డెన్ మాణిక్యమ్మకు ఫ్యాన్లు అందిస్తున్న ఎస్ఐ చంటిబాబు

బాలికల వసతి గృహానికి ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి ఎస్‌సి బాలికల వసతి గృహంలో ఫ్యాన్‌లు లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు రూ.పది వేల విలువైన ఐదు సీలింగ్ ఫ్యాన్‌లను హాస్టల్ వార్డెన్ మాణిక్యమ్మకు అందించి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. గత 15 రోజుల క్రితం భద్రతా చర్యల్లో భాగంగా ఎస్ఐ హాస్టల్‌ను తనిఖీ చేశారు. వసతి గృహంలో నివసిస్తున్న బాలికలు ఫ్యాన్లు లేక దోమలతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చదువుకు ఆటంకం కలుగుతుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందుకు మానవతా దృక్పథంతో స్పందించిన ఎస్ఐ తన కుటుంబం సభ్యులతో కలిసి వెళ్లి ఆదివారం సాయంత్రం ఫ్యాన్లను అందించారు. ఎస్ఐ ఉదార స్వభావం పట్ల వసతిగృహంలోని బాలికలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు, అధికారులు ఆయనను అభినందించారు.




పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను మావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1975-76 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ విదేశాల్లో ఉన్న అప్పటి విద్యార్థులు, దూరప్రాంతాల్లో, స్థానికంగా ఉన్న పలువురు హాజరయ్యారు. కష్టసుఖాలు ఒకరినొకరు అడిగితెలుసుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబోధన చేసిన గురువులు లక్ష్మీపతి అప్పారావు, కొండూరి గురుమూర్తిని సత్కరించారు. ఈ బ్యాచ్‌కి చెందిన పాఠశాల పూర్వవిద్యార్థి మామిడిపల్లి రమణమూర్తి 2021లో పాఠశాలకు డైనింగ్ హాల్ భవన నిర్మాణాన్ని చేపట్టి పాఠశాలకు అప్పగించిన నేపథ్యంలో ఆయనను పూర్వవిద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కొండా గంగరాజకుమార్, ఎంవి.పాండురంగారావు, సిహెచ్.సత్యనారాయణ, కె.కొండమ్మ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో నిరాహార దీక్షలో టిడిపి నాయకులు

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్ష

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ద్వారకాతిరుమలలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. చంద్రబాబును రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రలో భాగంగా అక్రమ అరెస్టు చేశారని మద్దిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరాహార దీక్షలో టిడిపి మండల నాయకులు మొగతడకల శ్రీను, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, ఏపూరి దాలయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు : జిల్లా కేంద్రం ఏలూరులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్ష చేపట్టారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన ఈ దీక్ష చేపట్టారు.



ఏలూరులో....

మాజీ ఎంఎల్‌ఎ రామకృష్ణారావుకు సతీవియోగం

ప్రజాశక్తి- తణుకు

తణుకు మాజీ ఎంఎల్‌ఎ ముళ్లపూడి వెంకటకృష్ణారావు సతీమణి సతీమణి లక్ష్మి ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మాజీ ఎంఎల్‌ఎ రాధాకృష్ణ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటకృష్ణారావును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మి మృతి ఆమె కుటుంబానికి తీరని లోటన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్ష్మి మృతి పట్ల సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని సింగరాయపాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరు మండలం వేమవరప్పాడుకు చెందిన యువకుడు బోడావుల నాగరాజు (29) ఆదివారం సింగరాయపాలెంలో ఉన్న తన బంధువుల ఇంటి వద్ద జరిగిన శుభాకార్యానికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో సింగరాయపాలెంలోని ఇసుక కాలువ వద్ద బైక్ టైర్ పంక్చర్ అవ్వడంతో బైక్ ఆదుపు తప్పి కల్వర్డును ఢీ కొట్టి కాల్వలో పడింది. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్రగాయాలు కావడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ డి.వెంకటకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగరాజు వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు.



వడాలి ప్రధాన సెంటర్‌లో గుంతల్లో నీరు కనబడక వాహనదారుల అవస్థలు



వడాలి -చిగురుకోట రోడ్డులో చెరువును తలపిస్తున్న రోడ్డుపై గుంతలో నీరు

ఈ రహదారులు.. ప్రాణ సంకటాలు

గుంతలతో అధ్వానంగా ముదినేపల్లిలో రోడ్లు
ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఏరోడ్డుపై ప్రయాణించాలన్నా ప్రజలు, వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఈ రోడ్లపై ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిందే. అత్యంత భయంకరంగా, ప్రమాదకరంగా ఈ రోడ్ల పరిస్థితి ఉంది. అసలే రోడ్లన్నీ గుంతలమయంకాగా, దీనికి తోడు తరచూ మండలంలో కురుస్తున్న వర్షాలకు రోడ్లు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో గోతులు కనబడక గుంతల్లో పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై క్షతగాత్రులుగా మారుతున్నారు. ఈ గుంతలు వాహనదారుల పాలిట ప్రాణ సంకటంగా మారాయి. ముదినేపల్లి - బంటుమిల్లి రోడ్డులో, మండలంలోని వడాలి ప్రధాన సెంటర్‌లో, అంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డుపై భయంకరమైన గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి ఈ గుంతల్లోకి నీరు చేరడంతో రోడ్డు కనిపించడంలేదు. రోడ్డు ఎక్కడ ఉందో, గుంత ఎక్కడో ఉందో తెలియక వాహనదారులు తికమక పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. రోడ్డుపై దారి కనిపించక నిత్యం పదుల సంఖ్యలో ఇక్కడ ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా వడాలి - చిగురుకోట వెళ్లే రోడ్డులో వడాలి జగన్నాథస్వామి ఆలయ సమీపంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతతో వాహనదారులు హడలిపోతున్నారు. ఇక్కడ రోడ్డు కుంగిపోవడంతో ఈ గుంతలో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. వర్షాలకు మూడు అడుగుల మేర ఈ గుంతలో నీరు చేరింది. దీంతో రోడ్డులో వెళ్లే వాహనదారులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారాయి. దీంతో భయపడుతున్న వాహనదారులు భారీ గుంత పక్కనే ఉన్న గ్రామ అంతర్గత సిసి రోడ్డులో నుంచి ముందుకు వెళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద తిరిగి చిగురుకోట ప్రధాన రోడ్డుకు చేరుతున్నారు. కొత్తగా ఈ రోడ్ల మార్గంలో ప్రయాణించే జనం ఎక్కువ శాతం ప్రమాదాలకు గురవుతుండగా, నిత్యం తిరిగే ప్రజలు కూడా తరచూ ఈ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. దీంతో ఈ రోడ్లపై ప్రయాణించాలంటేనే ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏమిటి ఈ ఖర్మంటూ రోడ్ల అధ్వాన పరిస్థితిపై ప్రజలు అధికారులను దుమ్మెత్తిపోస్తున్నారు. మండలంలో దాదాపు అన్ని ఆర్అండ్‌బి, జిల్లా పరిషత్ రోడ్లు, గ్రామాల్లోని అంతర్గత రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. మొన్నటి వరకు రోడ్లపై ఏర్పడ్డ గుంతలు కనబడేవి గనుక గుంతలను తప్పించుకొని వాహనదారులు వెళ్లేవారు కాని ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గుంతల్లో బురదనీరు చేరడంతో గుంతలు కనబడక ఎక్కువ శాతం మంది గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని నరకప్రాయంగా మారిన ఈ రోడ్లకు కనీసం మరమ్మతులైనా చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు అధికారులను ముక్తకంఠంతో కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 9901 కేసులు పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ పురుషోత్తమకుమార్

ప్రజాశక్తి - ఏలూరు



ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా 9901 కేసులు పరిష్కరించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.రాజేశ్వరి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 33 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏలూరులో ఎనిమిది బెంచీలు, భీమవరంలో ఐదు, కొవ్వూరులో నాలుగు, నరసాపురంలో మూడు, తణుకులో నాలుగు, తాడేపల్లిగూడెంలో మూడు, పాలకొల్లులో ఒకటి, నిడదవోలులో ఒకటి, జంగారెడ్డిగూడెంలో రెండు, చింతలపూడిలో ఒకటి, భీమడోలులో ఒకటి చొప్పున బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9901 కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. వాటిలో 9485 క్రిమినల్ కేసులు, 65 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 183 సివిల్ కేసులను రాజీ చేయగా 168 ఫ్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఏలూరులో 1876, భీమవరంలో 971, చింతలపూడిలో 513, జంగారెడ్డిగూడెంలో 887, కొవ్వూరులో 867, నరసాపురంలో 760, పాలకొల్లులో 601, తాడేపల్లిగూడెంలో 940, తణుకులో 1077, నిడదవోలులో 960, భీమడోలులో 449 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కేసుల పరిష్కారానికి తోడ్పాడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, ఎపి ఎస్‌పిడిసిఎల్ అధికారులకు, జిల్లా పంచాయతీ శాఖ వారికి, పత్రిక విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో విజయవాడ వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖలఅందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

హేలాపురి కాంప్లెక్స్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్, హేలాపురి సర్వీస్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరులో గవరవరంలోని హేలాపురి కాంప్లెక్స్‌లో నెల వారి నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సుమారు 120 మందికి షుగర్, బిపి పరీక్షలు చేశారు. వారందరికీ టిఫిన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు పృథ్వి నరేష్, డాక్టర్ ఆర్.రాజారావు, హౌస్ సర్జన్ కానాల గాయత్రి రోగులను పరీక్షించారు. వారికి సలహాలు ఇచ్చి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కెబి.రావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు వచ్చినప్పుడు డాక్టర్లను సంప్రదించి మందులు వాడి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి డి.రమాదేవి, లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ వి.మురళీమోహనరావు, లయన్స్ జిల్లా నాయుకులు ఎల్.వెంకటేశ్వరావు, సభ్యులు ఆర్.పద్మకుమారి సేవలందించారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో ఏనుగులవారివీధిలో ఎంపీ నిధులతో నిర్మిస్తున్న రజకుల కమ్యూనిటీ హాలుకు వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచి పొడుం పుష్ప, వార్డు మెంబర్ మురళి, వైసిపి యువ నాయకుడు పొడుం శ్యాం కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న బుగ్గ మురళీకృష్ణ

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు



సముద్రంలో పర్యాటకుల సందడి

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటక, ప్రకృతి ప్రేమికులు సుదూర ప్రాంతాల నుంచి బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో అధిక సంఖ్యలో పర్యాటకులు బీచ్‌కి తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకువస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలు దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

80 శాతం జగనన్న ఇళ్లు పూర్తి

హౌసింగ్ ఎఇ సతీష్

ప్రజాశక్తి - భీమడోలు



నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్న గుండుగొలను జగనన్న కాలనీ

భీమడోలు మండలానికి కేటాయించిన 28 జగనన్న లే అవుట్‌లలో 27 లే అవుట్‌లలో గృహనిర్మాణాలు ప్రారంభమై 80 శాతం పూర్తయ్యాయని హౌసింగ్ ఎఇ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేరకు అవసరమైన సహాయ సహకారాలను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఈ లే అవుట్‌లలో 2030 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, 50 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా మంజూరైన నిధులతో నిర్మాణ పనులు చేపట్టామని ఎఇ తెలిపారు. 556 ఇళ్ల లబ్ధిదారులు పూర్తిస్థాయిలో నిర్మాణాల పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేశారన్నారు. 1123 ఇళ్ల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. 54 ఇళ్లు శ్లాబులు పూర్తయ్యాయని, 87 శ్లాబు దశకు చేరుకున్నాయన్నారు. 394 ఇళ్లకు బేస్‌మెంట్ ఎగువ స్థాయిలో నిర్మాణాల జరుగుతుండగా, 378 ఇళ్ల నిర్మాణాలు పునాది స్థాయిని దాటాయన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు చెల్లించాల్సిన రూ.22.75 కోట్లకు గాను సుమారు రూ.18 కోట్లు చెల్లింపులు పూర్తయ్యాయన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం రాయితీపై ఇనుము, సిమెంటు రాయితీ ధరకు శానిటరీ, నీటి సరఫరా పరికరాలతో పాటు గుమ్మాలు, కిటికీలను ఎన్‌సిఎల్ సంస్థ తక్కువ ధరకు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం లబ్ధిదారుని పేరు కేటాయించే మొత్తాల్లో మరుగుదొడ్డి నిర్మాణం కోసం రూ.12 వేలు, ఉపాధి హామీ ద్వారా 90 రోజుల పని నిమిత్తం రూ.2,400 అందజేస్తుందన్నారు. మండలానికి మరుగుదొడ్ల నిర్మాణాల కోసం 1479 యూనిట్లు కేటాయించగా వీటిలో 59 యూనిట్లు లబ్ధిదారులు పొందారని వివరించారు. భూగర్భ జలాలు పెంచేందుకు, వృథాగాపోతున్న నీటిని సద్వినియోగపరుచుకునేందుకు ఒక్కొక్క ఇంటి నిర్మాణంతో పాటు ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఒక్కోదానికి రూ.ఆరు వేలు వంతున కేటాయింపులు జరుగుతాయని, ఈ మొత్తాలను లబ్ధిదారునికి కేటాయించే యూనిట్ ధర నుంచి ప్రత్యేకిస్తామని తెలిపారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. తాగునీటి సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. గుండుగొలను కాలనీ రోడ్లకు రూ.70 లక్షలు, చెట్టున్నపాడు రోడ్లకు రూ.4.5 లక్షలు, ఆగడాలలంక రోడ్డుకు రూ.ఏడు లక్షల కేటాయింపులు జరిగాయన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న నాలుగు కాలనీలో భీమడోలు, ఆగడాలలంక, గుండుగొలను, పొలసానపల్లి కాలనీలో నాలుగు ఆర్చరీల నిర్మాణానికి రూ.24 లక్షలు కేఆయించారని తెలిపారు.

మండలానికి ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద 49 ఇళ్లు మంజూరు కాగా వీటిలో 25 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిలో నాలుగు ఇళ్లనిర్మాణాలు పూర్తిస్థాయిలో ముగిశాయి. ఒక ఇంటికి శ్లాబ్ వేశారని, నాలుగు ఇళ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయని, మూడు ఇళ్లు బేస్‌మెంట్ ఎగువన నిర్మాణాలు జరుగుతున్నాయని, 37 ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ దిగువస్థాయిలో ఉన్నాయని తెలిపారు.

అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో జిల్లాలో ఏ విధమైన అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఆదివారం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి తెలిపారు. ఏర్పాట్లను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ముఖ్యకూడళ్లలో బందోబస్తును ఏర్పాటు చేసి ప్రధాన రహదారుల్లో పెట్రోలింగ్ వాహనాల ద్వారా, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించామన్నారు. బందోబస్తు ఏర్పాట్లను తెల్లవారుజాము నుండే స్వయంగా పర్యవేక్షించామని తెలిపారు. ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులూ కలగకుండా, ప్రశాంత జీవనానికి ఆటంకం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలను కాపాడాలని పోలీస్ అధికారులకు ఆదేశాలుజారీచేశామన్నారు.

'ఎస్ఆర్‌కెఆర్'లో నేడు ఓరియంటేషన్ డే

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11వ తేదీ సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. ఈ ఓరియంటేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, జెఎన్‌టియు కాకినాడ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ, భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ వివిఎస్ఎన్.వర్మ హాజరవుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా సీట్లు ఉన్న తమ కళాశాలలో పూర్తిస్థాయిలో కన్వీనర్ కోటాలో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. ప్రధానంగా కంప్యూటర్ ఆధారిత కోర్సులతో పాటు కోర్ గ్రూపులైన సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో కూడా పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయని వివరించారు. గతేడాది కోర్ గ్రూపులకు కూడా తమ కళాశాలలో ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉద్యోగాలు పొందారని వెల్లడించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా పలు పరిశోధన కేంద్రాలు తమ కళాశాలకు మంజూరు చేశాయని చెప్పారు

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - ఆకివీడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలు, అభిమానులు శాంతిభద్రతలకు భంగం కలిగించడం తగదని వైసిపి నాయకులు, శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం లయన్స్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చిన ఆయన వైసిపి నాయకులు కేసిరెడ్డి మురళి నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయాల్లో స్వచ్ఛత ఉండాలన్నారు. రాజకీయాల్లో ఆరోపణలు సహజమని, అయితే వాటిని నిరూపించుకుని బయట పడాలని అన్నారు. ఇది అంతిమ తీర్పు కాదని, ఆరంభమేనని, తప్పు చేయకపోతే అది కోర్టులో నిరూపించుకుని బయటికు రావచ్చని చెప్పారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. పంచాయతీ ఏర్పడిన అనంతరం సిబ్బంది లేరని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. త్వరలో సిబ్బందిని నియమించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. నగర పంచాయతీ అభివృద్ధికి తాను తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ వైస్ ఛైర్‌పర్సన్ పుప్పాల సత్యనారాయణ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, వైసిపి నాయకులు మోటుపల్లి గంగాధరరావు, కేశవరెడ్డి దిలీప్, ఎండి అలీ, అంబటి రమేష్, ఎండి.జిక్కీ పాల్గొన్నారు.

టిడిపి నేతలు సంయమనం పాటించాలి

ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కోర్టు తీర్పును గౌరవించి టిడిపి నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సూచించారు. ఆదివారం సాయంత్రం టిడిపి అధినేత చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన నివాసం వద్ద రామరాజు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు బెయిల్ వచ్చేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. జగన్ కక్ష సాధింపు చర్యల్లో భాగమే తప్ప మరొకటి కాదన్నారు. కనీసం 16 గంటలైనా జైలులో పెట్టాలని వైసిపి నాయకులు దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. చంద్రబాబు నాయుడు మచ్చలేని వ్యక్తి అని, బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్తామని, అక్కడ తమకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందని చెప్పారు.

పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలి

ఎపిటిఎఫ్ జిల్లా కన్వీనర్ రమణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మిగిలిన పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా కన్వీనర్ రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలలకు నిధులు మంజూరు కాకపోవడంతో పాఠశాలల నిర్వహణా భారం ప్రధానోపాధ్యాయులపై పడుతుందని పేర్కొన్నారు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, పాఠశాలల సామగ్రి, స్టేషనరీ కొనుగోలు, పాఠశాలలో వివిధ కార్యక్రమాల నిర్వహణ, నీటి వసతికి సంబంధించి మైనర్ రిపేర్లు, తల్లిదండ్రుల సమావేశాలు వంటి ఖర్చులు భారంగా మారాయని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలకు నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే అన్ని పాఠశాలలకు పాఠశాల నిధులను మంజూరు చేయాలని కోరారు.